క్లుప్తంగా

మండల రీసోర్స్ కోఆర్డినేటర్‌గా చల్లా



ఎమ్మార్పీగా విధులు చేపట్టిన కామేశ్వరరావు

ఆమదాలవలస రూరల్: గ్రామీణ నీటి సరఫరా విభాగం మండల రీసోర్స్ కో ఆర్డినేటర్‌గా చల్లా కామేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్డర్ కాపీని తీసుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావుకు అందజేసి శుక్రవారం విధులు చేపట్టారు. ప్రభుత్వం సేవలను ప్రజలకు అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహించానని, వారు తొలగించడంతో వాటి స్థానంలో ఈ పోస్టులను ఎంపిక చేసినట్లు కామేశ్వరరావు తెలిపారు. కొత్తగా విధులు కేటాయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పాస్ పుస్తకాల అందజేత



పాస్ పుస్తకాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ సచివాలయం పరిధిలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను సర్పంచ్ బాబూరావు, భీమారావు, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్ల అసిరయ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఇటీవల జగనన్న భూ రక్ష కార్యక్రమం ద్వారా రీ సర్వే చేశారు. సచివాలయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

సాగునీరు అందించండి



వంశధార కార్యాలయం ముందు బైఠాయించిన రైతులు

నరసన్నపేట: సాగునీరు రావడం లేదని, ఇప్పటివరకు దమ్ములు కూడా కాలేదని, వంశధార అధికారులు స్పందించి వెంటనే సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పోలాకి మండలం చెల్లాయివలస పరిసర గ్రామాలకు చెందిన రైతులు విన్నవించారు. పలువురు రైతులు నరసన్నపేటలోని వంశధార డీఈ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. సాగునీరు అందించాలని రైతులు నినాదాలు చేశారు. డీఈ శ్రీహరి స్పందించి.. వంశధార ఎడమ కాలువ ద్వారా సాగునీరు అనుకున్నట్లు వస్తున్నా.. శివారు గ్రామాలకు వచ్చే సరికి అలస్యం అవుతుందని, తక్షణమే చర్యలు తీసుకుని చెల్లాయివలసకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ సురేష్

నరసన్నపేట: ఆన్‌లైన్ మోసాలు అధికవుతున్నాయని దీనిపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంకు మేనేజర్ సురేష్ అన్నారు. స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని విశ్రాంత ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. మీరు వృద్ధులు కనుక ఇతరులకు చెప్పండి. వాళ్లు వింటారు అని మేనేజర్ అన్నారు. ఓటీపీ నంబర్ ఇతరులకు ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకు వాళ్లు ఎప్పుడూ ఓటీపీ అడగరనేది ఖాతాదారులు గమనించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్నామని, మరిన్ని సేవలు అందిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌బీ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరావు, బి.మోహన్‌రావు పాల్గొన్నారు. అనంతరం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య తనిఖీలు నిర్వహించారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నిర్బంధం

బూర్జ: ఎంపీడీఓతో సహా కార్యాలయ సిబ్బందిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే బూర్జ గ్రామస్తులు శుక్రవారం నిర్బంధించారు. బూర్జకు చెందిన బవిరి అప్పారావుకు ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ అందుతుండేదని, నాలుగు నెలలుగా నిలిచిపోయిందన్నారు. మరళా పింఛన్ విడుదలైనప్పటికీ ఎంపీడీఓ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అందజేసేందుకు తాత్సారం చేస్తున్నారని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తొత్తడి సురేష్, బాధితుడు బవిరి అప్పారావు, బవిరి పాపారావు, చిట్టి అసిరినాయుడు, సింహాద్రి చిరంజీవులు తదితరులు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిరసన తెలియజేశారు. ఎస్‌ఐ బి.అశోక్ బాబు, స్థానిక పోలీసులు కలుగజేసుకున్నారు. లబ్ధిదారుడికి పింఛన్‌ను అందించేందుకు ఎంపీడీఓ అంగీకరించడంతో వివాదం సద్దుమనిగింది. ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబుకు వివరణ కోరగా.. జిల్లా పీడీ ఆదేశాల మేరకే నిలుపుదల చేయడం జరిగిందన్నారు.

సంక్షేమమే సీఎం జగన్ అజెండా

- నూతన పింఛన్లు పంపిణీ చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం



పింఛన్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వెల్లడించారు. కొత్తగా మంజూరైన పింఛన్లను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత పాలకుల హయంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి పార్టీలకతీతంగా ఏడాదికి రెండు సార్లు పింఛన్ల పంపిణీ చేస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని స్పష్టంచేశారు. లంచాలకు, దళారీలకు తావులేకుండా ప్రతీ నెల 1వ తేదీన పింఛన్ సొమ్ము ఠంచన్‌గా అందిస్తున్న ప్రభుత్వం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ములు పెంచుకొంటూ వెళ్లడం జరుగుతుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, మండల పార్టీ కనీ్వనర్ జెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, మండల సచివాలయాల కో ఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, రాష్ట్ర ఎస్సీ సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ 67వ వారోత్సవాలు ప్రారంభం



ఎల్ఐసీ వారోత్సవాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సింహాచలం

నరసన్నపేట: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ 67వ వారోత్సవాలను నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత అవసరమన్నారు. ప్రతిఒక్కరూ ఎల్ఐసీ చేయించుకోవాలన్నారు. మేనేజర్ నేతాజీ మాట్లాడుతూ ఎల్ఐసీ దేశంలోనే అతి పెద్ద ఇన్సురెన్స్ సంస్థ అని అన్నారు. నరసన్నపేట ప్రాంతంలో ఉత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. బీమా వారోత్సవాలు కారణంగా స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నామన్నారు. వారం రోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు గౌతమ్, కాందీపన్, దనయ, నరేష్, పార్థసారధి, ఏజెంట్ల సంఘం ప్రతినిధులు వైవీ రమణ, పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ కరుణాకర్

పాతపట్నం: సంచార పశువైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు చెందిన పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం పశుసంవర్ధకశాఖ ఏడీఏ మంచు కరుణాకర్ అన్నారు. పాతపట్నం ప్రాంతీయ పశువైద్య కార్యాలయంలో సంచార పశువైద్య సేవలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సంచార పశువైద్య వాహనం గ్రామాలకు వచ్చే ముందురోజు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మేకలు, గొర్రెల మందల కాపరులకు సమాచారం తెలియజేయాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఉంటే సంచార పశువైద్య వాహనం సిబ్బంది పాడి రైతులకు తమ సేవలను అందజేయాలన్నారు. సమీక్ష కార్యక్రమంలో డాక్టర్ పారిశెల్లి అనిల్ (కొరసవాడ), డాక్టర్ మౌనిక (పెద్దలోగిడి), డాక్టర్ హరీష్ (మొబైల్ వాహనం), సిబ్బంది మోహన్, కుమారి, విజయ్ కుమార్ నారాయణ, రమణ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



ఉజ్జిడమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని పలు దేవాలయాలలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. దీంట్లో భాగంగా గొర్రిబంద సంతోషిమాత, సారవకోట ఉజ్జిడమ్మ, చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు.

నీలమణిదుర్గ అమ్మవారికి కుంకుమార్చనలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారికి శుక్రవారం సామూహిక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం కావటంతో పాతపట్నం పరిసర ప్రాంతాలతోపాటు ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారని ఆలయ అర్చకులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం

పొందూరు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా రాపాక సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది అభిమానులు శుక్రవారం రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం చైర్మన్ పిసిని చంద్రమోహన్, రిటైర్డ్ ఆర్‌జేడీ పాత్రుని పాపారావు, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల పార్టీ అధ్యక్షులు కె.నాగేంద్ర, కె.మల్లేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

త్రినాథరావు మృతి పార్టీకి తీరనిలోటు



కొత్తూరు జెడ్పీటీసీ భాగ్యవతి కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట(కొత్తూరు): కొత్తూరు జెడ్పీటీసీ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు, విశ్రాంత ఎంఈఓ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కామక త్రినాథరావు మృతి పార్టీకి తీరని లోటని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన త్రినాథరావు అంత్యక్రియలను అతని స్వగ్రామం కుంటిభద్రలో శుక్రవారం నిర్వహించారు. అంత్యక్రియాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. మృతుని భార్య, కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యవతిని ఓదార్చారు. ఎటువంటి అవసరం ఉన్నా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. త్రినాథరావు పార్టీ కోసం చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తానని త్రినాథరావు చెప్పిన మాటలను గుర్తుచేసుకుని విచారం వ్యక్తం చేశారు. అంత్యక్రియలులో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, అభిమానులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

నరసన్నపేట: మండలంలో అర్హులందరికీ పింఛన్లు మంజూరయ్యాయి. పదివేల పింఛన్లు పంపిణీ అవుతుండగా.. నూతనంగా 331 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. నరసన్నపేట మేజరు పంచాయతీలో 70 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేశారు. వీటిని సర్పంచ్ బూరల్లి శంకర్‌తో పాటు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు.



పురుషోత్తం నగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శంకర్

అంగన్‌వాడీలకు యూనిఫాం సరఫరా



ప్రాజెక్టు కార్యాలయంలో భద్రపర్చిన యూనిఫాంలు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు యూనిఫాం సరఫరా అయినట్లు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి శుక్రవారం తెలిపారు. సారవకోట, జలుమూరు మండలాల్లోని 193 అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్యకర్తలు, ఆయాలకు ఒక్కొక్కరికి జత చొప్పున యూనిఫాం వచ్చినట్లు పేర్కొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ

పొందూరు: మండలంలోని మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని సర్పంచ్ సుధారాణి, మండల విద్యాశాఖాధికారులు పీవీ రామరాజు, పట్నాన రాజారావు శుక్రవారం ఆవిష్కరించారు. అదే గ్రామానికి చెందిన గురుగుబెల్లి విష్ణుమూర్తి ఆర్థిక సహకారంతో పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలను పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు సన్మానించారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

సారవకోట: క్రీడా స్ఫూర్తితో ఆడాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఉజ్జయిని మహాకాళి ఆలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రస్తుతం యువత మొబైల్స్‌కు అంకితం అవుతున్నారని, ఇటువంటి సమయంలో టోర్నమెంట్ ఏర్పాటు చేయడం మంచిదన్నారు. ఈ టోర్నమెంట్‌కు జిల్లా స్థాయిలో 25 టీములు వచ్చాయని, మొదటి బహుమతిగా రూ.10వేలను ధర్మాన తేజ ఇవ్వనున్నారని, రెండో బహుమతిగా రూ.5,500 శిమ్మ రామకృష్ణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోన వెంకటేష్, కత్తిరి వెంకట రమణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ విజయవంతం చేయాలి



జలుమూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదనరావు

జలుమూరు: అందరి సమష్టి బాధ్యతతో ‘ఆడుదాం ఆంధ్రా’ విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం మాట్లాడారు. సచివాలయ స్థాయిలో 15 ఏళ్ల వయస్సు నిండిన బాలురు, బాలికలు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇందులో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలు ఉంటాయన్నారు. తరువాత మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయికి చేరుకుంటారన్నారు. మారుమూల గ్రామాలలో ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి, వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ మాధవరావు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: ఆడుదాం ఆంధ్ర పేరిట ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో నిర్వహించనున్న ఈ క్రీడా పోటీల్లో పీఈటీలు, పీడీలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి ఈ పోటీలు ఉంటయాని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ శాంతారావు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి భవానీశంకర్

మెళియాపుట్టి: ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామ సచివాలయాల స్థాయి నుంచి క్రీడాపోటీలకు జట్లును సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి భవానీశంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్యదర్శులు, పాఠశాలల పీఈటీలు, పీడీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు అవసరమైన మైదానాలు, సదుపాయాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర స్థాయి పోటీలు విశాఖపట్నంలో ఉంటాయన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓ దేవేంద్రరావు, తహసీల్దార్ సరోజిని, ఏఈ తిరుపతి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

జలుమూరు: మొక్కలు పెంపకంపై దృష్టి పెట్టాలని డామవమా పీడీ చిట్టిరాజు అన్నారు. లింగాలవల, చల్లవానిపేటల్లోని జగనన్న కాలనీలను శుక్రవారం సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక వసతుల ఏర్పాటు, మొక్కలు పెంపకంపై మాట్లాడారు. ఆదాయం పెంచే కూరగాయలు, ప్రధానంగా మునగ వేసుకోవాలని, ఉపాధి పథకం ద్వారా వాటిని లబ్ధిదారులకు అందిస్తామన్నారు. అనంతరం కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ప్రతీ సాంకేతిక సిబ్బంది కనీసం రెండెకరాల విస్తీరణంలో మునగ సాగు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ పట్ట సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవులతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: మొక్కలు అధికంగా పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని రెడ్డీస్ ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి షామిక్ త్రెహన్ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ అటవీ పెంపకం- క్షేత్రస్థాయి ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రైతులు వ్యవసాయ భూమిలో సగ భాగం మొక్కలు పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చీఫ్ ఆపరేషన్స్ అధికారి ప్రణవ్‌చౌదరి, డిప్యూటీ మేనేజర్ హరిబాబు, ఏరియా మేనేజర్ తవిటినాయుడు, సమన్వయకర్తలు అత్తులూరి లావణ్య, రాజ్‌కుమార్, గ్రామపెద్దలు అత్తులూరి గిరి, రాంబాబు పాల్గొన్నారు.